క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి ఆహ్వానం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో జరుగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి రావాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సోమవారం ఆహ్వాన కార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని నరేందర్ రెడ్డి నివాసంలో కార్డు అందజేసి అంగరంగవైభవంగా రాములోరి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట శ్రీరామ కల్యాణ మహోత్సవ కమిటీ సభ్యులు చౌడవరపు మోహన్ రావు, ఎడ్ల రమేష్ ఉన్నారు.

నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలి



డోర్నకల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షలను సోమవారం డీసీఈబీ జిల్లా సెక్రెటరీ ఎం.విజయసుశీల పరిశీలించారు. మన్నెగూడెం, ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్, తదితర పాఠశాలల్లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. నిబంధనలు ప్రకారం పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థులకు వసతులు కల్పించాలని ఆదేశించారు.

కాంగ్రెస్‌లో చేరిక




పెద్దవంగర: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో సల్లెండి మంజుల సుధాకర్ దంపతులు, మహంకాళి యాకయ్య, కాసోజ్ శోభన్‌బాబు, చింత వెంకట సోములు, ఉప్పలయ్య, కర్ణాకర్, రవి, వెంకన్న, కిరణ్, ఎల్లయ్య శ్రీకాంత్, పరశురాములు ఉన్నారు.

పార్లమెంట్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జ్‌గా రాందాసు



మహబూబాబాద్ రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ ఓబీసీ జాయింట్ కోఆర్డినేటర్ పింద్రాల రాందాసును ఓబీసీ సెల్ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించామని టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ సోమవారం తెలిపారు.

పట్టపగలు విద్యుత్ వెలుగులు



డోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలోని రైతువేదిక భవనం ఎదురుగా పట్టపగలే వీధిదీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్ స్తంభాలకు అమర్చిన లైట్లతోపాటు రైతువేదిక ఎదురుగా నేరుగా విద్యుత్ లైనుకే ప్రమాదకరంగా అమర్చిన బల్బు పట్టపగలే వెలుగు చిమ్ముతోంది.

పారిశుద్ధ్య పనులను నిర్లక్ష్యం చేయొద్దు

మహబూబాబాద్: కార్మికులు పారిశుద్ధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బోనగిరి గోపీరత్నం, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, గురుకుల, ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఈనెల 22 వరకు పూర్తి అవుతాయి. 23న విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేస్తారు. జూన్ 12న మళ్లీ పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

శిథిలావస్థలో దాశరథి గ్రంథాలయం

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

చిన్నగూడూరు: గ్రంథాలయాలు యువతకు దేవాలయాలు. అలాంటి గ్రంథాలయాలు పాలకుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడిన దాశరథి కృష్ణమాచార్యులు పుట్టిన గడ్డ చిన్నగూడూరు మండల కేంద్రంలో దాశరథి పేరున ఏర్పాటు చేసిన గ్రంథాలయం నేడు మూగబోయింది. మండల కేంద్రంలోని దాశరథి గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుని మూతపడింది. స్థానికులే చందాలు వేసుకుని గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రంథాలయానికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించకపోవడంతో పాఠకులకు సరైన రీతిలో సేవలందించక మూతపడిపోయింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపయోగపడాల్సిన విలువైన పుస్తకాలు చెదలు పడుతున్న దుస్థితి నెలకొంది. గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో పై కప్పు నుంచి వర్షపు నీరు చేరి పుస్తకాలు, వారపత్రికలు, గ్రంథాలు నీటిలో తడిచి చెదలు పడుతున్నాయని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గ్రంథాలయంను పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా చొరవ తీసుకుని గ్రంథాలయానికి పక్కా భవనాన్ని నిర్మించాలని పాఠకులు, స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో గ్రంథాలయం



చెదలు పడుతున్న పుస్తకాలు



పెచ్చులూడుతున్న గోడలు

నూతన భవనం నిర్మించాలి



శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మించాలి. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పుడున్న ప్రభుత్వమైనా స్పందించి నూతన భవనాన్ని నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.

– గాదే పెల్లి సత్యనారాయణ, దాశరథి గ్రంథాలయం చైర్మన్

నిధులు మంజూరు చేయాలి



గ్రంథాలయం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలి. పాఠకులకు, పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలను అందుబాటులోకి తేవాలి.

– రావుల సరేష్, నిరుద్యోగి, చిన్నగూడూరు

మూడోసారి మోదీనే ప్రధాని



మరిపెడ: మాట్లాడుతున్న సీతారాంనాయక్

మరిపెడ: మూడోసారి కూడా మోదీనే ప్రధాని అవుతారని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ అన్నారు. మరిపెడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటుతోపాటు విద్యావ్యవస్థను పటిష్టం చేసే బాధ్యత తనదన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, బీజేపీ డోర్నకల్ బాధ్యులు భూక్య సంగీత, నాయకులు గంగాచారి, లింగయ్య, సుధాకర్‌నాయక్, జగన్‌నాయక్, రమణ, భాస్కర్, బింగి రమేష్ పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేయాలి

మహబూబాబాద్ అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోటగడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని మానుకోట పార్లమెంట్ కన్వీనర్ ఎర్రగొల్ల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కన్వీనర్ ఎర్రగొల్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో ఓబీసీ జిల్లా మోర్చా అధ్యక్షుడు పైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, ఉపాధ్యక్షుడు జంపయ్య, అశోక్, రవి, అసెంబ్లీ కన్వీనర్ గణేష్, టౌన్ అధ్యక్షుడు యాకన్న, భద్రం, మండల అధ్యక్షుడు పూర్ణచారి, భద్రం పాల్గొన్నారు.

‘రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది?’



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

నెహ్రూసెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యానికి రూ.500 మద్దతు ధర, రూ. 2లక్షల రుణమాఫీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సమగ్ర వ్యవసాయ రుణ ప్రణాళికను రూపొందించాలని పేర్కొన్నారు. అనంతరం పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ సమావేశంలో జడ సత్యనారాయణ, యదల్లపల్లి సత్యం, గొని ఐలయ్య, రాచర్ల బాలరాజు, బానోత్ ఊశ్లా, బుర్క వెంకటయ్య, ఎం.గిరి, తదితరులు పాల్గొన్నారు.

‘కార్పొరేట్లకే దేశ సంపద దోచిపెట్టారు’



మాట్లాడుతున్న విజయసారథిరెడ్డి

నెహ్రూసెంటర్: దేశంలో బీజేపీ, మోదీ ప్రభావం తగ్గిపోయిందని, పార్లమెంటరీ ఎన్నికల్లో వంద సీట్లు కూడా రావని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పదేళ్ల పాలనలో కార్పొరేట్లకే దేశ సంపదను దోచిపెట్టారని, గెలిపించిన ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని, మోదీ పాలనకు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, చిరంజీవి, ఎండి.ఫాతిమా పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

బయ్యారం: మండలంలోని మిర్యాలపెంట పంచాయతీ పరిధిలోని పత్యాతండాలో గుడుంబా స్థావరాలపై సోమవారం బయ్యారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గుడుంబా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకంతోపాటు 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడిన ఇస్లావత్ భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మౌలానా తెలిపారు.

హక్కుల కోసం పోరాడాలి

నెహ్రూసెంటర్: యాదవుల హక్కుల కోసం పోరాటాలు నిర్వహించి సాధించుకోవాలని యాదవ మహాసభ పట్టణ అధ్యక్షుడు పెరుగు వేణు యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో 22వ వార్డు అధ్యక్షుడిగా నూకల సాయికిరణ్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి రవియాదవ్, బాబురావు, వెంకట్‌యాదవ్, రాసాల నగేస్‌యాదవ్ పాల్గొన్నారు.

రేషన్‌షాపు తనిఖీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలో గల రేషన్‌షాపును గ్రామ ప్రత్యేక అధికారి కోట కనకయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

యువకులు గంజాయికి దూరంగా ఉండాలి



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

గార్ల: గంజాయి సేవించిన యువకులు పోలీసులకు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై జీనత్ కుమార్ హెచ్చరించారు. సోమవారం గార్లలోని కొంతమంది యువకులకు గంజాయి సేవించడం వలన కలిగే అనర్థాల గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. యువకులు గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. అదే విధంగా రాష్ట్ర నార్కోటిక్స్ వారు ఇటీవల ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు గంజాయి డిటెక్షన్ కిట్‌ను పంపిచినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే ఈ నంబర్‌కు 87126 56974 సమాచారం ఇస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్యామ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు



మరిపెడ: అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మరిపెడ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మరిపెడలో సోమవారం జాతీయ రహదారిపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ సంతోష్‌కుమార్, రాజు, బాసు, లక్ష్మీరామ్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక రైల్వేస్టేషన్ సెంటర్‌లో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈనెల 20వ తేదీ వరకు జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా డోర్నకల్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అగ్నిమాపక సేవలపై స్థానికులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బోరగళ్ల శరత్, ఫైర్ స్టేషన్ సిబ్బంది ఎల్ఎఫ్ డి.చంద్రమౌళి, డీఓపీ ఆర్.శ్రీనివాస్, ఎఫ్ఎం మహేష్, హెచ్‌జీ పి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి



సీఐటీయూలో చేరుతున్న అంగన్‌వాడీలు

గూడూరు: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని బీఆర్టీయూ జిల్లా కార్యదర్శి జక్కుల మంగమ్మతోపాటు గూడూరు సెక్టార్‌లోని 50 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సంఘానికి రాజీనామా చేసి సీఐటీయూలో చేరారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ధార స్నేహబిందు, ప్రాజెక్టు అధ్యక్షురాలు తిరుపతమ్మ, మంజుల, స్వరూపరాణి, మంగ, ఉమ, సువర్ణ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదాలు



మరిపెడ రూరల్: మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



గార్ల: జీవంజిపల్లిలో దగ్ధమైన వెదురు చెట్లు

మరిపెడ రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు చెరువు కట్ట చెట్ల పొదలకు నిప్పు పెట్టిన ఘటన మండలంలోని గిరిపురంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గిరిపురం గ్రామ శివారు ఊరచెరువు కట్ట ఇరువైపుల చెట్ల పొదలకు కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటల వ్యాపించి కట్ట రహదారిపై పొగలు కమ్ముకున్నాయి. కట్ట రోడ్డుపై ప్రయాణించే పలు వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న మరిపెడ ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోడంతో గిరిపురం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నిప్పుపెట్టిన కారకులను గుర్తించి కఠిన చర్య తీసుకోవాలని ప్రయాణికులతో పాటు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వెదురు చెట్లు దగ్ధం

గార్ల: గార్ల సమీపంలోని జీవంజిపల్లి గ్రామంలో బోడ అశోక్ ఇంటి వెనుకభాగంలో సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వెదురుచెట్లు కాలిపోయాయి. సుమారు రూ.20వేల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. సమయానికి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలార్పింది. సంఘటనా స్థలాన్ని ఆర్ఐ రామకృష్ణ సందర్శించారు.

పట్టణ శివారు పెద్ద చెరువులో..

డోర్నకల్: పట్టణ శివారులోని పెద్ద చెరువులో సోమవారం మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగి చెరువులోని చెట్లు, గడ్డికి అంటుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్నతో పాటు మున్సిపల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు.

చెట్టుకు నిప్పు

స్థానిక చర్చి కాంపౌండ్‌లో సోమవారం ఓ భారీ వృక్షానికి నిప్పంటుకోవడంతో చెట్టు మొదట్లో మంటలు చెలరేగాయి. చెట్టు సమీపంలో చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్టుకు నిప్పంటుకొని మొదలు కాలింది. స్థానికులు నీళ్లు పోసినా తిరిగి మంటలు వస్తున్నాయి.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ మహబూబాబాద్ బ్రాంచ్ ఆవరణలో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహనీయుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం బ్రాంచ్ సెక్రెటరీ దాసరి హరికృష్ణ ఎస్ఎస్ఈ, పీవే రాజమౌళి, సెక్షన్ ఓఎస్ రాజు, బ్రాంచ్ ట్రెజరర్ ప్రతాప్, అసిస్టెంట్ సెక్రెటరీ కొలిపాక రాజు, బ్రాంచ్ సభ్యులు రత్నం, ప్రశాంత్, బొడ్డు రవి, మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ అవుల యుగంధర్, మున్సిపల్ కార్మిక విభాగ నాయకులు మంగళంపల్లి రాజు, డీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ దాసరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బీఎస్పీలోకి పంజా కల్పన



తొర్రూరు: బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకురాలు, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు కోఆర్డినేటర్ పంజా కల్పన బీఎస్పీలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లోని బీఎస్పీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ నుంచి వరంగల్ పార్లమెంట్ స్థానం ఆశించగా పార్టీ ఆమెకు టికెట్ నిరాకరించింది.

ఉత్సవ విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ

నర్సింహులపేట: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా నూతన ఉత్సవ విగ్రహాలను సోమవారం ఊరేగింపుగా తీసుకెళ్లి హోమం చేసి ప్రాణప్రతిష్ఠ చేశారు. దాతలు సీతారాముడు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలతో మండల కేంద్రంలో ఊరేగింపుగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి తీసుకెళ్లారు. వేదపండితులు అభిషేకాలు, హోమం నిర్వహించి ప్రాణ ప్రతిష్ఠ చేశారు.

చలివేంద్రం ప్రారంభం

పెద్దవంగర: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయని పంచాయతీ కార్యదర్శి గీత అన్నారు. సోమవారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో జనవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. బొమ్మెర నాగేష్ తల్లి సోమలక్ష్మి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనవికాస మేనేజర్ రమా, కోఆర్డినేటర్ సరిత పాల్గొన్నారు.

అభిషేక పూజలు

బయ్యారం: బయ్యారంలోని రామాలయంలో సోమవారం మహాకుంభాభిషేకం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు నిర్వహించనున్న పూజల్లో భాగంగా మొదటిరోజు గణపతిపూజ, చండీయాగం తదితర పూజలను పండితులు నిర్వహించారు.

శునకాల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

బయ్యారం: కుక్కలు దాడి చేయటంతో చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం బయ్యారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని బచ్చలిబజార్‌లో నివాసం ఉంటున్న వర్షిత అశోక్ కుమార్తె గగనపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేయూత అందించాలి

తొర్రూరు: సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఇట్టె సోమిరెడ్డి అన్నారు. విశ్రాంత ఉద్యోగి వంగపల్లి రాజలింగం జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం గోశాలకు దాణా వితరణ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు యాకూబ్, కోటయ్య, విజయ్‌కుమార్, వీరభద్రం, రవీందర్, సంజీవరెడ్డి, ఉపేందర్, గోశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్గో సెంటర్ ప్రారంభం



దంతాలపల్లి: ప్రజలకు సేవ చేసేందుకు మరింత చేరువలోకి తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ వచ్చిందని తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్టీసీ కార్గో సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో తొర్రూరు కార్గో ఇన్‌చార్జ్ చైతన్యకుమార్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ రజిత, కార్గో నిర్వాహకుడు నరేష్ పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలకు తరలిరావాలి

తొర్రూరు: పట్టణంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకలకు తరలిరావాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మచ్చ సురేష్ తెలిపారు. ఈ నెల 17న పట్టణంలోని పాటిమీది ఆలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరామ నవమి వేడుకల కరపత్రాలను సోమవారం డివిజన్ కేంద్రంలో భక్తులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శంకర్, శ్రీనివాస్, నర్సయ్య, లక్ష్మయ్య, వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

మధనాపురానికి ‘గరికపాటి’

గూడూరు: మండలంలోని మధనాపురం లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత, మహా సహస్ర అవధి గరికపాటి నర్సింహారావు రానున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు లింగాల సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 17న గ్రామంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నివాళి

మరిపెడ: రామసహాయం రంగారెడ్డి సేవలు మరువలేనివని ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. రంగారెడ్డి దశ, దినకర్మకు ఎమ్మెల్యే హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్, నాయకులు నూకల నరేష్‌రెడ్డి, గంధసిరి అంబరీష, కాలం రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ

నెల్లికుదురు: యువత అంబేడ్కర్ స్ఫూర్తితో జ్ఞాన సమాజాన్ని నిర్మించాలని ఎస్సై కనుకుల క్రాంతికిరణ్ అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ వాది బొడ్డు అశోక్ ఆధ్వర్యంలో ‘అంబేడ్కర్ ఎవరు.. ఆయన ఏం చేశారు’ అనే పుస్తకాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్సై చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాగెల్లి శేఖర్, మహేందర్, శ్రీధర్, జగదీష్, ప్రకాష్, అశోక్, వెంకన్న, వివేక్, రమేష్ పాల్గొన్నారు.

పరామర్శ..

గూడూరు: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు బొంత రాములు కుమారుడు వెంకటేశ్ ఆదివారం అప్పుల బాధతో మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెల్సుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నూకల సురేందర్, జలగం సంపత్‌రావు, చీదురు వెంకన్న, వాంకుడోతు కిశోర్‌సింగ్, ఎండి. రహీంపాషా, దేవేంద్రాచారి, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, బోడ ఎల్లయ్య, ఎదునూరి వెంకన్న పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన



చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం, మన్నెగూడెం నర్సరీలను మండల ప్రత్యేక అధికారి వరలక్ష్మీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని చిన్నగూడూరు, జయ్యారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సందర్శించి మాట్లాడారు. నర్సరీలకు సంబంధించి వనసేవక్ సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీళ్లు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ యాకయ్య పాల్గొన్నారు.